# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 05, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు..



## మణుగూరు ఏరియాలో కార్మికుల ఆవేదన..




బేసిక్, వేజ్ ప్రొటెక్షన్ లేక తీవ్ర నష్టం 2లో..

# పట్టా భూముల నిషేధమే ఇందిరమ్మ రాజ్యమా..

- కాంగ్రెస్1000 రోజుల పాలనపై హరీశ్‌రావు ధ్వజం



**మంచిర్యాల, సెప్టెంబర్ 4 :** కేసీఆర్ సర్కార్ అసైన్డ్ భూములకు పట్టాలిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ పట్టా భూములను అసైన్డ్ భూములు చేసి నిషేధిత జాబితాలో పెడుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు.పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టి మీరు చేసిన తప్పులకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలో సమాధానం చెప్పాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. రైతుల నోటికాడి బుక్క గుంజుకోవడం.. పట్టా భూములు, అసైన్డ్ భూములను తీసుకెళ్లి నిషేధిత జాబితాలో పెట్టడం.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలు, నిషేధిత జాబితా 22(ఏ) బాధితులకు అండగా శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో బీఆర్ఎస్ శంఖారావం సభ, మంచిర్యాలలో ప్రెస్‌మీట్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని 22ఏ బాధితులందరినీ కబ్జాదారులని మాట్లాడిన మాటలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిషేధ జాబితా నుంచి రైతుల భూ ములను తొలగించాలని లేకపోతే వేలాది మంది బాధితులతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని, అక్కడ సీఎం లేకపోతే జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటిని ముట్టడి స్తామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేదాకా అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల మిగతా 3లో..

## నడిరోడ్డుపై వంటసర్కార్‌కు మంట..



- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ నిరసనలు వివరాలు 2లో..

## సురేఖను తప్పించడం బాధాకరం..



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ మంత్రివర్గం నుంచి కొండా సురేఖ
- పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని కోరుకుంటున్నాం

వివరాలు 2లో..

## డాటా.. ఏఐ రంగాలకు స్వర్ణయుగం..



- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఐటీని టైర్-2, 3 సిటీలకు విస్తరించాలి : కేటీఆర్
- బీఆర్ఎస్ పాలనలో చిన్న పట్టణాల్లో ఐటీ హబ్‌లు
- స్మార్ట్‌ఫోన్లలో ప్రతి స్వైప్ వెనుక కంటెంట్ క్రియేషన్
- కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో కేటీఆర్

వివరాలు 3లో..

# పార్టీ మారినోళ్లను మళ్లా రానివ్వం:

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** 'కాంగ్రెస్ అంటేనే కొట్లాటలు.. కుమ్ములాటలు.. కమీషన్లు.. భూ దందాలు.. చిల్లర పంచాయితీలు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దెప్పిపొడిచారు. 'వరంగల్ జిల్లా కాంట్రాక్టులు, హైదరాబాద్ భూము లు, పారిశ్రామికవేత్తలను బెదిరించి డబ్బుల వసూళ్ల వల్లే సీఎం, సురేఖ, పొంగులేటి మధ్య పంచాయితీ మొదలైంది.. వాటాల పంపకంలో తేడాలు రావడం వల్లే ఇప్పుడు పరాకాష్టకు చేరింది' అంటూ సంచలన విమర్శలు చేశారు. వెయ్యిరోజుల కాంగ్రెస్ పాలనలో ఓ మహిళా మంత్రిని బర్తరఫ్ చేయడమే సాధించిన అతిపెద్ద ఘనత అని ఎద్దేవాచేశారు.సీఎం, మంత్రుల మధ్య మొదలైన కొట్లాటలతో కాంగ్రెస్ సర్కార్ పతనం ప్రారంభమైందని చెప్పారు. అన్నదమ్ములను అడ్డపెట్టుకొని విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.'కాంగ్రెస్ సర్కార్ చేసిన వందల కుంభకోణాలను బీఆర్ఎస్ ఆధారాలతో బయటపెట్టింది.. ఇప్పుడు కొండా సురేఖ కూతురు సుస్మిత సైతం రేవంత్ అన్నదమ్ములు, అనుయాయుల బాగోతాలను బహిర్గతం చేసింది. వారు పారిశ్రామి కవేత్తలు, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని చెప్పింది. కానీ ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానమేది? లేవనెత్తిన అంశాలపై చర్చ ఏది?' అని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మిగతా 3లో..

## కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ భేటీ..

- అసెంబ్లీ సమావేశాలపై నేతలకు దిశానిర్దేశం




**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** ఈ నెల 7నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ నెల 6న ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం లంచ్ తర్వాత 2 గంటలకు ప్రారంభమయ్యే సంయుక్త సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని పార్టీ అధినేత శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ తరపున లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వ నిర్ణయాలపై స్పందన, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే విధానం తదితర అంశాలపై కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన నేపథ్యంలో జరుగుతున్న సమావేశాలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ శాసనసభా పక్షం సమన్వయంతో వ్యవహరించేలా కేసీఆర్ పలు కీలక ఆదేశాలు, సూచనలు చేయనున్నారు.

## సమ్మక్క సాగర్ బ్యారేజీకి వేగంగా ఎన్ఓసీ ఇవ్వాలి



- ముంపు బాధితులను ఆదుకుంటాం
- అవసరమైతే ముందుగానే పరిహారం జమ
- 4.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ

మిగతా 3లో..

## కేసీఆర్ చాలా మంచోడు..

- ఎమ్మెల్యే కొండా సురేఖ
- ఎప్పుడూ ఒక మాట అనలేదు
- ఆయనలో హుందాతనం ఉంది.. మేము వెళ్లిన ప్రతిసారీ మంచిగ రిసీవ్ చేసుకునేవారు



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ప్రశంసలు కురిపించారు. కేసీఆర్ చాలా మంచి వ్యక్తి అని, తమను ఎప్పుడూ ఒక మాట కూడా అనలేదని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఓ మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ.. కేసీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ పలు విషయాలను పంచుకున్నారు. కేసీఆర్‌లో ఎంతో హుందాతనం ఉంటుందని, తాము ఎప్పుడు వెళ్లినా ఆప్యాయంగా పలుకరిస్తూ మంచిగా రిసీవ్ చేసుకునేవారని తెలిపారు. తాము ఏదైనా అంశంపై ఆయన్ను కలిసినప్పుడు సానుకూలంగా స్పందించేవారని చెప్పారు.తమ పట్ల ఆయన ఎప్పుడూ గౌరవంగా వ్యవహరించారని చెప్పారు. రాజకీయంగా భిన్న పరిస్థితులు, అభిప్రాయాలు ఉన్నప్పటికీ కేసీఆర్ వ్యక్తిగతంగా తమతో వ్యవహరించిన తీరు హుందాగా ఉండేదని సురేఖ వ్యాఖ్యానించారు. తాము అడుగగానే కేసీఆర్ స్పందించి కొండా మురళికి ఎమ్మెల్సీ ఇచ్చారని ఆమె గుర్తుచేశారు. కేసీఆర్‌లోని హుందాతనం, తమను ఆప్యాయంగా పలుకరించిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. రాజకీయంగా ఎవరి వైఖరి ఎలా ఉన్నా వ్యక్తిగత సంబంధాలను గౌరవించే లక్షణం కేసీఆర్‌లో ఉన్నదని వెల్లడించారు.

## షబాష్‌పల్లి కంపెనీలో గంజాయి కలకలం..



- ఐదుగురు అరెస్ట్ కోర్టులో హాజరుపరిచిన తూప్రాన్ పోలీసులు వివరాలు 2లో..

## మద్దూరులో డిగ్రీ కాలేజీ పనులు వేగవంతం చేయాలి



సీఎం రేవంత్ రెడ్డి 5లో..

## సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారిపై ఏసీబీ కేసు..

- రూ.3.54 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు 2లో..



## నడిరోడ్డుపై వంటసర్కార్‌కు మంట..

మిగతా 3లో..

కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ నిరసనలు



## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు.. కదంతొక్కిన నేతలు..!



వివరాలు 2లో..

# మరోసారి నిరుద్యోగుల సమరశంఖం..
# ఈనెల 7న అసెంబ్లీ ముట్టడి

- పోలీస్ పోస్టుల వయోపరిమితి పెంపు, తదితర డిమాండ్లు నెరవేర్చాలి : జేఏసీ



హైదరాబాద్, సెప్టెంబర్ 04: రాష్ట్రంలోని రేవంత్ సర్కార్‌పై నిరుద్యోగులు మరోసారి సమరశంఖం మోగించారు. పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంపుతో పాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిరుద్యోగ జేఏసీ ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితిని 38 ఏండ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. పోలీస్ ఎంపిక ప్రక్రియలో నిబంధనలు సడలించాలని కోరారు. గిరిజన ప్రాంతాల అభ్యర్థులకు ఏజెన్సీ కోటాను పునరుద్ధరించాలని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు పాత కమిషనరేట్ల ప్రకారం నోటిఫికేషన్ నిబంధనలు వర్తింపజేయాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం జీవోలతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు..

## ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



హైదరాబాద్, సెప్టెంబర్ 04: తెలంగాణ ప్రభుత్వం కీలక నామినేటెడ్ పదవుల్లో ముగ్గురు బీసీ మహిళలకు అవకాశం కల్పించింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ నియామకాలు చేపట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నామనే సంకేతాన్ని ఇస్తూ ప్రభుత్వం గద్వాల విజయలక్ష్మి, నేరెళ్ల శారద, గుండు సుధారాణిలను కీలక పదవుల్లో నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

### ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన గద్వాల విజయలక్ష్మిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షురాలిగా ప్రభుత్వం నియమించింది. ఆమెకు కేబినెట్ హోదా కల్పించింది. గతంలో ఈ పదవిలో ఉన్న చిన్నారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో ఏర్పడిన ఖాళీని విజయలక్ష్మితో భర్తీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కే. కేశవరావు కుమార్తె అయిన విజయలక్ష్మి.. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద

గద్వాల విజయలక్ష్మి రాజీనామాతో ఖాళీ అయిన తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవిని గౌడ సామాజిక వర్గానికి చెందిన నేరెళ్ల శారదతో భర్తీ చేశారు. మహిళా హక్కులు, సంక్షేమం, రక్షణకు సంబంధించిన అంశాల్లో మహిళా కమిషన్ కీలక పాత్ర పోషించే నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది.

### కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి

వరంగల్ ప్రాంత అభివృద్ధిలో కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖఖణూ) చైర్‌పర్సన్‌గా మాజీ ఎంపీ, వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి నియమితులయ్యారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఆమెకు ఈ కీలక బాధ్యత అప్పగించారు. మొత్తంగా ముగ్గురు బీసీ మహిళా నాయకురాళ్లకు కీలక పదవులు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వం బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామనే సందేశాన్ని ఇచ్చినట్లయింది. ఈ నియామకాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# సురేఖను తప్పించడం బాధాకరం..

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ మంత్రివర్గం నుంచి కొండా సురేఖ
- పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని కోరుకుంటున్నాం



హైదరాబాద్, సెప్టెంబర్ 4 : మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సురేఖ బర్తరఫ్ అంశంపై శుక్రవారం ఆయన స్పందించారు. పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నాయకులకు తమ అభిప్రాయాలు, సమస్యలను చెప్పుకొనేందుకు పార్టీలో అంతర్గతంగా ఎన్నో వేదికలు ఉన్నాయని, వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని తప్పిదమని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖ కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను కనీసం ఆమె ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. పార్టీ నియమాలను ఖాతరు చేయని వైఖరి కారణంగానే అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మహేశ్‌కుమార్ వివరించారు. రాజకీయ లబ్ధి కోసం, ఒత్తిడి తేవడం కోసం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం లేదని తేల్చిచెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించినప్పటికీ, కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీ విధేయత, క్రమశిక్షణను కాపాడేందుకు అధిష్ఠానం ఈ కఠిన వైఖరి అవలంబించిందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా హైకమాండ్ చూస్తూ ఊరుకోదని మహేశ్‌కుమార్ స్పష్టంచేశారు.

# షబాష్‌పల్లి కంపెనీలో గంజాయి కలకలం..

- ఐదుగురు అరెస్ట్ కోర్టులో హాజరుపరిచిన తూప్రాన్ పోలీసులు



తూప్రాన్, సెప్టెంబర్ 4: మెదక్ జిల్లా తూప్రాన్ పరిధిలో గంజాయి కలకలం రేపింది. షబాష్‌పల్లి ప్రాంతంలోని ఓ కంపెనీలో పని చేసేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఐదుగురు వ్యక్తులు గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలావుద్దీన్, లవకుష్, హన్స్రాజ్, దినేష్, యస్తామికుమార్ షబాష్‌పల్లి ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేసేందుకు వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిలో అలావుద్దీన్, లవకుష్ తమ వెంట ఉత్తరప్రదేశ్ నుంచి సుమారు 100 గ్రాముల గంజాయి తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తూప్రాన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురు హన్స్రాజ్, దినేష్, యస్తామికుమార్ కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో మొత్తం ఐదుగురిపై సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ చర్యలు తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టగా, ఎస్ఐలు గంగరాజు, యాదగిరితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం, కలిగి ఉండడం, విక్రయించడం లేదా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ పోలీసులు హెచ్చరించారు.

# డాటా.. ఏఐ రంగాలకు స్వర్ణయుగం..

- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఐటీని టైర్-2, 3 సిటీలకు విస్తరించాలి : కేటీఆర్
- బీఆర్‌ఎస్ పాలనలో చిన్న పట్టణాల్లో ఐటీ హబ్‌లు
- స్మార్ట్‌ఫోన్లలో ప్రతి స్వైప్ వెనుక కంటెంట్ క్రియేషన్
- కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 04: డాటా, ఏఐ రంగాలకు స్వర్ణయుగం రాబోతున్నదని, టైర్-2, 3 నగరాల్లోని ప్రతిభావంతులైన యువత వీటిలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రైమియా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కేటీఆర్‌కు వివరించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నదని, ముఖ్యంగా డాటా, డాటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు(ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవంతో చెబుతున్నానని వివరించారు. తాను కూడా రెండు దశాబ్దాల క్రితం కార్పొరేట్ ప్రపంచంలో పనిచేశానని, అమెరికాలో విద్యాభ్యాసం చేసి అక్కడ కొంత కాలం ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నదని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్‌జోన్లలో పనిచేస్తూ, అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసని చెప్పారు. కాన్‌స్టర్ పేరుపై సరదాగా స్పందించిన కేటీఆర్, సంస్థ పేరు వెనకున్న 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ్' అనే భావన తనకు ఆసక్తికరంగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దానిని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్‌స్టర్ సంస్థలకు కీలక పాత్ర ఉంటుందని చెప్పారు. నేటితరం సమాచారాన్ని పొందే విధానమే మారిపోయిందన్నారు. గతంలో వార్తాపత్రికలను పేజీపేజీగా చదివే రోజులుండేవని, ప్రస్తుత యువతరం మొబైల్ ఫోన్‌లో స్వైప్ చేస్తూ ప్రపంచాన్ని చూస్తున్నదని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవంతో డేటా, స్టోరేజ్ రంగాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందని చెప్పారు. కేసీఆర్ పాలనలో ఐటీరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని కేటీఆర్ చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని టైర్-2 నగరాలకు విస్తరించే లక్ష్యంతో అనేక ఐటీ హబ్‌లు నిర్మించామని గుర్తుచేశారు. ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, మహబూబ్‌నగర్, కరీంనగర్ లాంటి నగరాల్లో స్థానికంగా ప్రతిభ కలిగిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఐటీ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. కొవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పనిచేసే విధానాన్ని పూర్తిగా మార్చేసిందని కేటీఆర్ స్పష్టంచేశారు. ఒకప్పుడు కార్యాలయానికి వచ్చి, ఒకేచోట కలిసి పనిచేస్తే పనులు జరుగుతాయని భావించేవాళ్లమని, కొవిడ్ తర్వాత ఎక్కడి నుంచైనా పనిచేసి సమర్థవంతంగా ఫలితాలు సాధించవచ్చని నిరూపితమైందని పేర్కొన్నారు

# పాడి కౌశిక్‌కు ఎథిక్స్ కమిటీ నోటీసులు



హైదరాబాద్, సెప్టెంబర్ 4 : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. సభలో ఆయన వ్యవహరించిన అనుచిత ప్రవర్తనపై శనివారంలోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ కార్యాలయం నోటీసులు అందజేసింది. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 29న అసెంబ్లీలో గనుల తవ్వకాల అవకతవకలపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ వివాదం చోటుచేసుకున్నది. సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతుండగా కౌశిక్‌రెడ్డి జోక్యం చేసుకుని, గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయనను ప్రశ్నించారు. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి చేతులతో సైగలు చేయడం వివాదానికి దారితీసింది.

# సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారిపై ఏసీబీ కేసు..

- రూ.3.54 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు

### వ్యవసాయ భూములు, ఇళ్ల పత్రాలు గుర్తింపు



సూర్యాపేట, సెప్టెంబర్4: ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి, కోదాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న వుయ్యాల సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన ఏసీబీ అధికారులు గురువారం ఆయన నివాసం, కార్యాలయంతోపాటు బంధువులు, సన్నిహితులు, ఇతరులకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. అవినీతి నిరోధక చట్టం--1988లోని సెక్షన్ 13(1)(ఏ) రెడ్‌విత్ 13(2) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సోదాల్లో అధికారులు పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. వాటిలో సూర్యాపేట జిల్లాలో 3ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దీని అధికారిక విలువ సుమారు రూ. 2.94 లక్షలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సూర్యాపేట జిల్లా, హైదరాబాద్ పరిధిలోని హయత్‌నగర్‌లో కలిపి ఐదు నివాస ఆస్తులను గుర్తించారు. వీటిలో ఒక జీ+1 భవనం, ఒక జీ+2 భవనం, ఒక జీ+4తో పాటు పెంట్‌హౌస్ భవనం, రెండు గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. వీటి అధికారిక విలువ సుమారు రూ. 2.75 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ఇక సూర్యాపేట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి అధికారిక విలువ సుమారు రూ. 2.58 లక్షలుగా ఉన్నప్పటికీ, మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే గణనీయంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పీవీ సునీత

### లోక్‌భవన్ పాఠశాల టీచర్‌కు అవార్డు



హైదరాబాద్, సెప్టెంబర్ 4 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని అందజేయనున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పీవీ సునీత ఎంపికయ్యారు. హైదరాబాద్ జిల్లా నుంచి అందజేసే అవార్డుకు ఆమెను అధికారులు ఎంపికచేశారు. ఐదేండ్లుగా పీవీ సునీత లోక్‌భవన్ పాఠశాలలో టీచర్‌గా సేవలందిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్టులో వరుసగా 100% ఉత్తీర్ణత సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. సునీతకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.

# మణుగూరు ఏరియాలో కార్మికుల ఆవేదన..




### బేసిక్, వేజ్ ప్రొటెక్షన్ లేక తీవ్ర నష్టం

మణుగూరు, సెప్టెంబర్ 3: మణుగూరు ఏరియాలో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌గా నియమితులైన కార్మికులకు బేసిక్, వేజ్ ప్రొటెక్షన్ లేకపోవడంతో తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ఏరియాల నుంచి మణుగూరు సర్ఫేస్‌కు బదిలీపై వచ్చిన కార్మికుల బేసిక్ నుంచి భారీగా వ్యక్తిగత స్ప్రా కోత విధించడంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారడంతో సర్ఫేస్ విభాగంలో విధులు నిర్వహించేందుకు అవకాశం కోరిన కార్మికులకు, యాజమాన్యం నిర్ణయాల కారణంగా ఆర్థికంగా నష్టం కలుగుతోందని బాధితులు పేర్కొంటున్నారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్నందుకు తమ వేతనాల్లో భారీగా కోతలు పడుతున్నాయని, గతంలో పొందుతున్న వేతనాలతో పోలిస్తే ప్రస్తుతం చేతికి వచ్చే జీతం గణనీయంగా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యల కారణంగా అండర్‌గ్రౌండ్ విధులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితుల్లో సర్ఫేస్ డ్యూటీకి వచ్చిన తమపై ఇలాంటి ఆర్థిక భారం మోపడం న్యాయం కాదని కార్మికులు అంటున్నారు. తమ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, బేసిక్, వేజ్ ప్రొటెక్షన్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ అంశంపై కార్మిక సంఘాలు స్పందించి యాజమాన్యంతో చర్చించి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కార్మికుల వేతనాలు, బేసిక్ నుంచి జరుగుతున్న కోతలు, వేజ్ ప్రొటెక్షన్ అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగాల్సి వస్తుందని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## సమ్మక్క సాగర్ బ్యారేజీకి వేగంగా ఎన్‌ఓసీ ఇవ్వాలి

- ముంపు బాధితులను ఆదుకుంటాం
- అవసరమైతే ముందుగానే పరిహారం జమ
- 4.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** సమ్మక్క--సారక్క బ్యారేజీకి నిర్మాణ అనుమతిని (ఎన్‌ఓసీ) వీలైనంత త్వరగా జారీ చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరారు. ముంపునకు గురయ్యే భూములు, ఇండ్లకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లిస్తుందని హామీనిచ్చారు. అవసరమైతే పరిహార నిధులను ముందుగానే జమ చేసేందుకు కూడా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పరస్పర సహకారం, సంప్రదిం పుల ద్వారా పెండింగ్ అంశాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్‌కు సంబంధించిన అంతర్రాష్ట్ర అంశాలు, బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపునకు గురయ్యే భూములు, నివాస గృహాలు, బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఛత్తీస్‌గఢ్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో పూర్తి జలాశయ మట్టం వరకు నీటిని నిల్వ చేసి, ప్రాజెక్టు నిర్దేశిత సాగునీటి ప్రయోజనాలను రైతులకు అందించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సహకరించాలని ఉత్తమ్ కోరారు. ముంపు ప్రభావిత కుటుంబాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం భూములు, ఇండ్లు, ఇతర ఆస్తులకు పరిహారాన్ని అంచనా వేసి పూర్తిస్థాయిలో చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైతే పరిహారానికి అవసరమైన నిధులను ముందుగానే జమ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు మంత్రి వెల్లడించారు. బ్యారేజీలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకు నేందుకు వీలుగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఎన్‌ఓసీ జారీ చేయాలన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరిం చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## వాట్సాప్ లో మరో కొత్త ఫీచర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** వాట్సాప్ తన వినియోగదారుల కోసం కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. ఇకపై కరెంట్, గ్యాస్, నీరు, ఇన్సూరెన్స్, క్రెడిట్ కార్డు, లోన్ రీపేమెంట్లు వంటి 30 రకాల బిల్లులను, 22,700 పైగా బిల్లర్లకు వాట్సాప్ ద్వారా సులభంగా చెల్లించవచ్చు. భారత్ కనెక్ట్ నెట్‌వర్క్‌తో కలిసి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో చేసిన చెల్లింపులను చూడటంతో పాటు, రాబోయే బిల్లులను ట్రాక్ చేయవచ్చు. మారుమూల ప్రాంతాల ప్రజలకు డిజిటల్ చెల్లింపులను చేరువ చేయడమే లక్ష్యమని మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ శ్రీనివాస్ తెలిపారు.

## తెలంగాణలో ఆటో ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం




**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** తెలంగాణలో ఆటో రిక్షా ఛార్జీల పెంపునకు రంగం సిద్ధమవుతోంది. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ, బీమా తదితర వ్యయాలను పరిగణనలోకి తీసుకున్న అధికారుల కమిటీ కొత్త ఛార్జీలను ప్రతిపాదిస్తూ రవాణాశాఖకు నివేదిక సమర్పించింది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. కమిటీ సిఫార్సుల ప్రకారం ఆటోలో కనీస ఛార్జీ 1.6 కిలోమీటర్లకు రూ.30గా నిర్ణయించాలని సూచించింది. ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయాలని ప్రతిపాదించింది. ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితుల్లో నిమిషానికి 75 పైసలు వెయిటింగ్ ఛార్జీగా తీసుకోవాలని, రాత్రి వేళల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనంగా వసూలు చేయాలని సిఫార్సు చేసింది. ఆటో, యాప్ ఆధారిత వాహనాల యూనియన్ల డిమాండ్ల నేపథ్యంలో అధికారులు కేరళ, ఢిల్లీ, బెంగళూరు, ముంబయి నగరాల్లో అమలవుతున్న ఛార్జీలను అధ్యయనం చేశారు. డ్రైవర్ల నిర్వహణ వ్యయం, ఇంధన ధరలు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందించారు.

## పట్టా భూముల నిషేధమే ఇందిరమ్మ రాజ్యమా..

పక్షాన గళమెత్తుతామని హామీ ఇచ్చారు. బ్రోకర్లను నమ్మొద్దని, లంచాలు ఇవ్వొద్దని కోరారు. నిషేధిత జాబితాలో తప్పైంది సారీ అని నాలుగు అక్షరాల సారీ చెప్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. 22ఏ బాధితుల రైతుల కండ్ల లో నీళ్లు చూసి, బ్యాంక్ అప్పు కోసం తల్లడిల్లే వారి బాధలు చూసి మాట్లాడాలని సూచించారు. లక్షల మంది ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి పీడిస్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎందుకు చర్య తీసుకోలేదో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మీకేమైనా ఫిఫ్టీ ఫిఫ్టీ షేరింగ్ ఉన్నదా? లేకపోతే ఎందుకు ఆయనపై చర్య తీసుకోవడం లేదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ ప్రజలు కేంద్రంగా పాలన చేస్తే, రేవంత్‌రెడ్డి భూముల చుట్టూ తిరుగుతూ పాలన చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఎవరి భూములు ఎట్లా గుంజుకోవా లి? ఎవరి భూమి 22ఏలో పెట్టాలనే ఆలోచనతో లక్షలాది ఎకరాలను, ఇండ్లు, ప్లాట్లను నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో 1000 స్కాములు, 1000 కబ్జాలు, 1000 అబద్ధా లు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

## పార్టీ మారినోళ్లను మళ్లా రానివ్వం:

పార్టీ నేత నంద్యాల దయాకర్‌రెడ్డితో కలిసి జగదీశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ పోరాటాలను ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

# కొండా సురేఖ రీఎంట్రీపై తేల్చేసిన బీఆర్ఎస్..!



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** అనూహ్య పరిణామాల మధ్య రేవంత్ రెడ్డి కేబినెట్ నుంచి మంత్రిగా బర్తరఫ్ అయిన కొండా సురేఖ తదుపరి అడుగులు ఎటువైపు అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయి. కూతురు చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖ తాను కాంగ్రెస్ లోనే ఉంటానని పైకి చెప్తున్నా.. లోలోపల చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో విపక్ష బీఆర్ఎస్లోకి ఆమె వెళ్తారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ దిశగా బీఆర్ఎస్ నేతలు రీఎంట్రీ కోసం ఆమెను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కూడా వార్తలొస్తున్నాయి. దీనిపై బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి స్పందించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకునే ఆలోచన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకునే ఆలోచన తమకు లేదని , తమ వైపు నుంచి ఆ ప్రయత్నం కూడా లేదని ఆయన స్పష్టత ఇచ్చేశారు. సురేఖను పార్టీలోకి తీసుకునే అంశంపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి కార్యక్రమాలను కొండా సురేఖ ఆధారాలతో సహా బయటపెడుతున్నారని, తప్పకుండా దీనిపైన విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు బర్తరఫ్ చేయాల్సింది రేవంత్ రెడ్డిని అని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. దొంగని వదిలేసి దొంగతనం చేసిండు అని చూపించిన వాళ్లని అరెస్ట్ చేసే సంస్కృతి కనిపిస్తుందంటూ తాజా పరిణామాలపై జగదీష్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి రానివ్వబోమన్నారు. కొండా సురేఖను తెలంగాణ భవన్ గేటు తాక నివ్వమని, పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరిని తప్ప ఎవరిని తీసుకోమని కూడా చెప్పేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇద్దరు బీఆర్ఎస్ లోకి రావడానికి రెడీగా ఉన్నారని, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అప్లికేషన్ పెట్టినా తీసుకోబోమని జగదీష్ తెలిపారు. ఎన్నికల కంటే ముందు కోమటిరెడ్డి బ్రదర్స్ బీఆర్ఎస్‌లోకి వస్తామంటే తీసుకోలేదన్నారు.

## చేయూత పెన్షన్లు అప్లై చేసుకునేవారికి శుభవార్త..

### కీలక వెసులుబాటు!




**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** తెలంగాణ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల విషయంలో మరో శుభావార్త చెప్పింది. కొత్త సామాజిక పించన్ల దరఖాస్తుల విషయంలో ముఖ్యమైన స్పష్టీకరణ ఇచ్చింది. దరఖాస్తు చేసేటప్పుడు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందుబాటులో లేకపోయినా సరే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ తెలిపింది. అయితే దరఖాస్తులను పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత ధ్రువ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించింది. అర్హులైన వ్యక్తులు సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఈ నిర్ణయం వల్ల చాలామంది అర్హులైన వ్యక్తులు సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. గీత కార్మికుల విషయంలో ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకపోయినా ఆధార్ కార్డు, రేషన్ కార్డుతోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువపత్రం, దివ్యాంగులకు సదరం లేదా యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ సహాయ డైరెక్టర్ ధ్రువీకరణ పత్రం అవసరం.

### సెప్టెంబర్ 15వరకు చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

ఈ పత్రాలు దరఖాస్తు సమయంలో లేకపోయినా సమస్య లేదు. కానీ ఎంపిక ప్రక్రియలో వాటిని సమర్పించకపోతే దరఖాస్తు తిరస్కరించబడే అవకాశం ఉంది. గతంలో పింఛను పొందినా ఏదైనా కారణంతో నిలిపివేయబడిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. చేయూత పింఛన్ల దరఖాస్తులకు మొదట జూలై 31వరకు గడువు ఉంది.అయితే చాలా మంది ఇంకా దరఖాస్తు చేయలేదని గమనించి ప్రభుత్వం సెప్టెంబర్ 15వరకు గడువును పొడిగించింది.

### ఆగస్టు 9 నుంచి ఐదు కేటగిరీల్లో దరఖాస్తుల స్వీకరణ

ఆగస్టు 9 నుంచి ఐదు కేటగిరీల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేస్తారు.ఆగస్టు 30 వరకు ఇప్పటికే 4.34 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వితంతువుల నుంచి మాత్రమే 2.64 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగింపు వల్ల మరో 50 వేలకు పైగా దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### కొత్తగా 2.50 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని లక్ష్యం

రాష్ట్రప్రభుత్వం కొత్తగా 2.50 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయాలు అర్హులైన పేదలకు, ముఖ్యంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు పెద్ద ఉపశమనం కలిగిస్తాయి. ధ్రువపత్రాలు సమయానికి సిద్ధం కాకపోయినా ముందుగా దరఖాస్తు చేసుకుని తర్వాత పత్రాలు సమర్పించే అవకాశం ఉండటం వల్ల అనేక మంది ప్రయోజనం పొందగలుగుతారు. అర్హులైనవారు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు..

# కదంతొక్కిన నేతలు..!



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్(దీ=వా) శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది. వికారబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని





ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేవంత్ చిత్రపటానికి పిండ ప్రదానం

### 20 మందిపై కేసు.. నలుగురి రిమాండ్.. బెయిల్ మంజూరు



**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4 :** ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు వెయ్యి రోజులైనా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని పాత బస్‌స్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం పెట్టి పిండ ప్రదానం చేశారు.పిండ ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నందుకు 20 మంది బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : ఎమ్మెల్యే విజయుడు



**జోగులాంబ గద్వాల :** ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆరోపించారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు,వికలాంగులు, మహిళలకు రూ. 2500, కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ (తులం బంగారం), విద్యార్థులకు స్కూటీ హామీలు మరిచిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు వంటవార్పు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు.

## నడిరోడ్డుపై వంటసర్కార్‌కు మంట..

### కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ నిరసనలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 04:** కాంగ్రెస్ సర్కార్‌పై నారీమణి గర్జిం చింది. వృద్ధులు, దివ్యాంగులు సైతం భగ్గుమన్నారు. ఆరు గ్యారెంటీలకు మంగళంపాడి, హామీలు ఎగవేయడంపై పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జీవన భృతి రూ.2,500, కల్యాణలక్ష్మి పేరిట రూ.లక్షానూట పదహార్లతోపాటు తులం బంగారం, విద్యార్థినులకు సూటీలు ఇస్తామని మాటిచ్చి నెరవేర్చకపోగా, కేసీఆర్ కిట్ సహా పలు పథకాలను నిర్వీర్యం చేయడంపై మహిళలు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మూడో రోజైన శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. వం టావార్పులతో నిరసనలు తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టగా, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత వంటా వార్పు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని ఇందిరా గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో పార్టీ శ్రేణులు, మహిళలతో కలిసి నిరసన తెలి పారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,మాజీఎమ్మెల్యే మెతుకుఆనంద్ వంటావార్పులో నిర్వహించారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు - ప్రభుత్వ దుష్ప్రచారం

## సంపాదకీయం

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 99 శాతం ఉద్యోగుల వేత నాలు, పెన్షన్లకే ఖర్చు చేయాల్సి వస్తుందనే దుష్ప్రచారాన్ని మంత్రుల నుండి ముఖ్యమంత్రి వరకు ఒక పథకం ప్రకారం సాగిస్తున్నారు. ఉద్యోగుల వేతన సవరణ ఎగ్గొట్టటానికే ఈ కుట్రపూరిత ప్రచారానికి వొడిగట్టారు. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకే ఈ విష ప్రచారం పరిమితం కాదు. ప్రజల సంక్షేమ పథకాలు, రైతుల వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్ వంటి వాటికి కూడా ఈ విమర్శలను ముడిపెడుతున్నారు. వీటి వల్ల అభివృద్ధికి నిధులు లేకుండా పోతున్నాయనే వాదన చేస్తున్నారు.ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం ఎంతో పరిశీలిద్దాం. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానంగా మూడు విధాలుగా ఆదాయం సమకూరుతుంది. మొదటిది రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా, రెండోది కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్ర వాటాతో పాటు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయం. మూడోది అప్పుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు విధాలుగా సమకూరిన ఆదాయం రూ.2.03 లక్షల కోట్లు. ఇవిగాక అప్పుల ద్వారా అదనంగా మరో రూ.77392 కోట్లు సమకూర్చుకుంది. కిందటి ఏడాదిలో చేసిన మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2.53 లక్షల కోట్లు కాగా ఇందులో రెవెన్యూ వ్యయ పద్దు కింద రూ.2.36 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇందులో అన్ని తరగతుల ఉద్యోగుల (శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్, ఇతర వేతన ఉద్యోగులు కలిపి) వేతనాలకు 26.04 శాతం, రిటైర్ అయిన వారి పెన్షన్లకు 37.36 శాతం చెల్లించారు. రెండింటికి కలిపి 37.40 శాతం ఖర్చు చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2015-16 లో చూస్తే మొత్తం రెవెన్యూ వ్యయంలో వేతనాలకు 28.6 శాతం, పెన్షన్లకు 11.7 శాతం రెండింటికి కలిపి 40.3 శాతం చెల్లించారు. పదేళ్ల కాలంలో రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పెన్షన్లకు చేసిన చెల్లింపులు 40.3 నుండి 37.40 శాతానికి తగ్గిపోయింది.ప్రభుత్వం ప్రస్ఫుటంగా చేస్తున్న మరో వాదన ఏమిటంటే రాష్ట్రానికి వచ్చే సొంత పన్ను, పన్నేతర ఆదాయంలో 99 శాతం వేతనాలు, పెన్షన్లకు ఖర్చవుతుందనేది. 2015-16లో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం (రాష్ట్ర జీఎస్టీ, సేల్స్ టాక్స్, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ ఫీజు, ఎక్సైజ్ డ్యూటీ, వాహన పన్ను, మైనింగ్ రాయల్టీ వంటి వాటి ద్వారా)లో వేతనాలకు 61.3 శాతం, పెన్షన్లకు 25. 1 శాతం చొప్పున మొత్తం 86.4 శాతం చెల్లించారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి సొంత పన్నులు, పన్నేతర ఆదాయం మొత్తం రూ. 1,17,167 కోట్లు రాగా ఇందులో వేతనాలకు 50.14 శాతం, పెన్షన్లకు 21.99 శాతం, మొత్తం రెండింటికి కలిపి 72.13 శాతం చెల్లించారు. వాస్తవంగా గడిచిన పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయంలో కూడా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వాటా 86.4 శాతం నుండి 72.1 శాతానికి అంటే నికరంగా 14.3 శాతం తగ్గిపోయింది. ప్రభుత్వం ఈ కఠోర వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా కప్పిపుచ్చి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నది. ప్రజల్లో వ్యతిరేకత సృష్టిస్తున్నది. ఉద్యోగులు, పెన్షనర్లకు వ్యతిరేకంగా ఉసిగొల్పుతున్నది.వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలే మూల కారణం. ఉదాహరణకు రాష్ట్ర ప్రభుత్వానికి 2025 -26లో జీఎస్టీ ద్వారా రూ.49498 కోట్లు, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా రూ.11046 కోట్లు, సేల్స్ టాక్స్ ద్వారా రూ.17811 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ (లిక్కర్ పై) ద్వారా రూ.18251 కోట్లు వచ్చింది. ఈ పన్నులు అత్యధిక భాగం ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలు వారికి వచ్చే ఆదాయాలను ఖర్చు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతున్నది. రాష్ట్ర ప్రభుత్వానికే కాదు కేంద్ర ప్రభుత్వానికి కూడా జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్, ఎక్సైజ్ డ్యూటీ వంటి వాటి ద్వారా వచ్చే ఆదాయానికి వీరే ప్రధాన కారణం.కానీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన కేంద్ర పన్నుల్లో వాటాను ఇవ్వకుండా దిగకోస్తున్నా టిడిపి కూటమి ప్రభుత్వం నోరు మెదపకుండా రాష్ట్రానికి రావాల్సిన ఆదాయ వనరులను దెబ్బతీస్తున్నది. కేంద్ర 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 42 శాతం బదిలీ చేయాలని (జమ్ము కాశ్మీర్‌ను విభజించిన తరువాత 41శాతానికి తగ్గించారు) సిఫారసు చేసింది. దీని ప్రకారం మన రాష్ట్రానికి కేంద్ర పన్నుల ఆదాయాన్ని మోడీ ప్రభుత్వం బదిలీ చేయడం లేదు. గత పదేళ్లుగా 30 శాతానికి మించి ఇవ్వడం లేదు.మరొకటి కేంద్రం ప్రభుత్వం సంక్షేమ పథకాలు, స్థానిక సంస్థలకు బదిలీ చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులు, అభివృద్ధి గ్రాంట్లకు కూడా భారీ కోత పెడుతున్నది. 2021-22లో రూ.39170 కోట్లు ఈ పద్దుల కింద రాగా 2025-26కి రూ.20,322 కోట్లుకు కోత పెట్టింది. అయినా టిడిపి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని నిలేయడం లేదు సరికదా పైగా కేంద్రంతో రాష్ట్ర కూటమి జత కట్టడం వల్ల రాష్ట్రానికి భారీగా నిధులొస్తున్నాయనే మాయా ప్రచారాన్ని సాగిస్తున్నది. రాష్ట్ర ఆర్థిక దుస్థితికి ఉద్యోగులు, పెన్షన్‌దారులను ప్రధాన కారకాలుగా బోనులో నిలబెడుతున్నది.రాష్ట్ర కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక విధానాలు రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయ రాబడిని దారుణంగా దెబ్బతీస్తున్నది. ఉదాహరణకు విశాఖపట్నం దగ్గరలో నక్కపల్లి దగ్గర ఏర్పాటు చేయబోతున్న ఆర్సిలాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పన్ను రాయితీలు, సబ్సిడీలు వల్ల రాష్ట్ర ఖజానా రూ 28 వేల కోట్లు నష్టపోతున్నది. ఈ పరిశ్రమకు అవసరమైన నీటి సరఫరాకు ఏకంగా రూ.660 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి అప్పు తీసుకొని 50 కిలో మీటర్ల పొడవునా పైపులైన్ కూడా వేస్తున్నది. విశాఖ చుట్టూ గూగుల్, అదానీ, రిలయన్స్ వంటి సంస్థలు ఏర్పాటు చేయబోతున్న 6.5 గిగావాట్ల (6500 మెగావాట్ల) సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లకు సుమారు రూ.లక్షా 43 వేల కోట్ల పన్ను రాయితీలు, సబ్సిడీలు ఇస్తున్నది. ఇంత పెద్ద మొత్తంలో రాష్ట్ర ఖజానా నష్టపోతున్నది. ఇటీవల ప్రారంభించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆదాయం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని, పన్నులను చంద్రబాబు ప్రభుత్వం పదేళ్ల పాటు చెల్లించనవసరం లేదని ఒప్పందం చేసుకుంది.రాష్ట్రంలో పరిశ్రమలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, స్టార్ హోటళ్లు, షాపింగ్ మాళ్లు... ఇలా ఏది ఏర్పాటు చేసినా 10 నుండి 15 ఏళ్ళు పాటు పన్నులు పూర్తిగా మినహాయిం చేశారు. అనేక సబ్సిడీలు ఇచ్చేస్తున్నారు. పైగా ఇపుడు పెట్టుబడులు పెట్టే వారికి రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో వారికి మౌలిక సదుపాయాలు కల్పించటమే కాక పెట్టుబడి వయబులిటీ గ్యాప్ పేర పెట్టే పెట్టుబడిలో 20 శాతం ఎదురు డబ్బు రాష్ట్ర ఖజానా నుండి ఇస్తుందని జీవోలు విడుదల చేశారు. ఒక్క డేటా సెంటర్లకే రాష్ట్ర ఖజానా నుండి సుమారు రూ.30 వేల కోట్లు చెల్లించటానికి ఒప్పందం చేశారు. ఒకవైపు పన్నుల మినహాయింపు, సబ్సిడీల వల్ల రాష్ట్ర ఖజానా రూ.వేల కోట్లు నష్టపోతుండగా... రెండో వైపు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలు చెల్లించే పన్నుల ఆదాయాన్ని కూడా అప్పనంగా పెట్టుబడిదారులకు దోచి పెడుతూ... ఉద్యోగులు, పెన్షనర్ల పిఆర్‌సి పై దాడి చేస్తున్నది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్ జిడిపి) పెరిగినా రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం పెరగటం లేదు. దీనికి ప్రధాన కారణం పెట్టుబడిదారులకు, పారిశ్రామిక అధిపతులకు ఇస్తున్న భారీ పన్నుల రాయితీలు, సబ్సిడీలే. దీనివల్ల గత పదేళ్లలో రాష్ట్ర జిడిపి లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం బాగా తగ్గిపోయింది. రెండో పక్క రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను విచ్చలవిడిగా కార్పొరేట్ దోపిడీకి అనుమతించడంతో పన్నేతర ఆదాయం కూడా రూ.వేల కోట్లు నష్టపోతున్నది. ఒక పరిశోధన ప్రకారం మైనింగ్ అక్రమాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.12 నుండి రూ.15 వేల కోట్లు నష్టపోతున్నది.రాష్ట్రంలో మరో తరహా ప్రమాదకర విధానాలు కూడా అమలు జరుగుతున్నాయి. గత మూడు దశాబ్దాల క్రితమే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రపంచబ్యాంకుతో ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలను బలహీనం చేసి ప్రైవేట్ శక్తులకు వాటిని అప్పజెప్పే విధానాలకు పూనుకున్నారు. ఇందులో ముఖ్యమైనది వివిధ ప్రభుత్వ డిపార్టుమెంట్లలో ఉన్న శాశ్వత ఉద్యోగులను క్రమంగా తొలగించడం, వీళ్లపై పెట్టే వేతన ఖర్చును తగ్గించుకోవడం. వీరి స్థానంలో అతి తక్కువ వేతనాలతో, ఏ హక్కులు, ఉద్యోగ భద్రత లేని వారిని నియమించుకోవడం. కొన్ని డిపార్టుమెంట్ విధులను పూర్తిగా ప్రైవేటుపరం చేయడం. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న బాధ్యతల నుండి క్రమేణా వైదొలిగి వాటిని ప్రైవేట్ మార్కెట్ శక్తులకు అప్పజెప్పటం. ఇప్పుడు మనం వీటి దుష్ఫలితాలన్నింటి చూస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో డిసెంబర్ 2025 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అన్ని డిపార్టుమెంట్లలో (ఆర్‌టిసి తో కలిపి) 5,87,299 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు. వీరుగాక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, అంగన్వాడీ, ఆశా వంటి స్కీమ్ వర్కర్లతో పాటు ఇతర పేర్లతో ఉన్న కాంట్రాక్ట్ వేతన ఉద్యోగులు మొత్తం 4,19,839 మంది ఉన్నారు. మొత్తం పర్మినెంట్, పర్మినెంటేతర కార్మికులు 10,07,138 మంది పని చేస్తున్నారు. రాష్ట్ర ఉద్యోగ వ్యవస్థలో పాలకులు ఎంత పెద్ద మార్పులు తీసుకొచ్చారో ఈ అంకెలను బట్టి అర్థమవుతున్నది. ఇపుడు ఈ విధానాలను వేగవంతం చేశారు. ప్రతి ఏడాది 15 వేల మదికి పైగా పర్మనెంట్ ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. 2036 నాటికి 1,52,738 మంది రిటైర్ అవుతారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించడం లేదు. ఖాళీ పోస్టులను రద్దు చేస్తున్నారు. విద్యా రంగాన్ని క్రమేణా కుదించేస్తున్నారు. కొన్ని రంగాలకు రంగాలనే ప్రైవేట్ పరం చేసే చర్యలకు తలపడుతున్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను బడా ఏజెన్సీలకు అప్పజెప్పేందుకు ఆలోచనలు చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితమే పాత పెన్షన్ పథకాన్ని రద్దు చేసేశారు. ఇలా మొత్తం ప్రభుత్వ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. అందువల్ల మొత్తం ఈ ప్రమాదకర విధ్వంసానికి వ్యతిరేకంగా రాజకీయ చైతన్యంతో ఐక్యంగా ఉద్యమించడమే నేటి తక్షణ కర్తవ్యం.

# వాక్‌స్వాతంత్రం, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం...

కొంత పూర్వకాలంలోకి వెళ్లి చూసినా భావ ప్రకటనా స్వేచ్ఛ అనేదాన్ని సంరక్షించుకోవలసి వస్తుందనేది ఊహకందని విషయంగానే వుండేది. బ్రిటిష్ పాలకుల కర్కోటక శాసనాలకు వ్యతిరేకంగా పోరాడిన భారత స్వాతంత్రోద్యమం వాక్ స్వాతంత్రం, భావ ప్రకటనా స్వేచ్ఛలను కాలరాచే దుర్మార్గ ప్రయత్నాలను అనుమతించ లేదు. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలో భారత దేశం సంతకాలు చేసింది. అసలు భారత రాజ్యాంగమే దానికి ఉక్కు చట్రంతో రక్షణ కల్పించింది. అయితే ఆ కాలాలు వేరు. విమర్శనాత్మక భావాలు నిరాక్షేపణీయ మైనవిగా వుండేవి. కానీ ఇప్పుడు మనం నివసిస్తున్న యుగం వేరు. ఇది గోడీ మీడియా అంచులలో నడుస్తున్నది. 'దిమాగీ నక్సల్స్' అనేవారిపై పోరాటం మామూలు విషయంగా మార్చబడింది. గత చాలా కాలంగా హేతుశీలతపై అన్ని వైపులా దాడి సాగుతున్నది. ప్రత్యేకంగా విజ్ఞాన శాస్త్రం, చరిత్రలపై కోరికోరి దాడులు చేస్తున్నారు. అన్ని రకాలైన చాందసులకూ బాగా చేతనైంది ఇదే. మన విద్యను, విజ్ఞాన వ్యవస్థలను తిరగదోడేందుకు ప్రస్తుత పాలక వ్యవస్థ ప్రత్యేకంగా పథకాలు అమలు చేస్తున్నది. చరిత్ర స్థానంలో పురాణాలే తెచ్చిపెట్టడం జరుగుతున్నది. ఇక తత్వశాస్త్రం స్థానాన్ని తమ భావజాలంతో నింపేయడం జరుగుతున్నది. వేల ఏళ్ల ముందే గ్రహాంతర యానాలు జరిగేవన్న విడ్డూరపు భావనలు ఏదో వైజ్ఞానిక వాస్తవాల్లా చలామణిలోకి తెస్తున్నారు. అంధకారం, అజ్ఞానం వైపుగా సాగుతున్న ఈ ప్రయాణాన్ని 'పీపుల్స్ డెమోక్రసీ' ఎప్పటికప్పుడు అందిస్తూనే వుంది. ఆరెస్సెస్, దాని హిందూత్వ శక్తులు ఈ ప్రయాణంలో చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. ప్రకృతికి సంబంధించిన వివిధ అంశాలను ఛేదిస్తున్న, సమాజంలో మార్పులకు కారణమవుతున్న విజ్ఞానశాస్త్రాన్ని చులకన చేస్తూ తిరస్కరిస్తు న్నాయి. రే బ్రాడ్‌బరీ రాసిన 'మాస్ట్రో' అనే నవల ఆధారంగా అదే పేరుతో ఫ్రాన్సిస్ ట్రూఫట్ 1966లో తీసిన సినిమా గుర్తు చేసుకోక తప్పదు. 'ఫారిన్‌హీట్451' ఒక నవీక దృశ్యకావ్యం. ఇక్కడ కాల్పనికత చాలా వింతగా వుంటుంది. ఒకానొక నిరంకుశ ప్రభుత్వం మొత్తం సాహిత్యమంతటినీ ధ్వంసం చేయడం కోసం ప్రత్యేకంగా అగ్నిమాపక సిబ్బందితో దళాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎవరినైనా ఏ సమయంలోనైనా దర్యాప్తు చేయడానికి, పుస్తకాలు దగ్ధం చేయడానికి వారికి అధికారమిస్తుంది. తిరుగుబాటు భావాలను రగిలించేవిగా కనిపించే భావాలన్నిటినీ నాశనం చేయాలనేది ఇక్కడ ఆలోచన. పాలకులు ఓ విప్లవం వస్తుందేమోనని హడలిపోతున్నందువల్ల ఇలా జరుగుతుంటుంది. ఇంత వరకూ చూస్తే యుగయు గాలుగా జరుగుతున్నదే. గియార్డినా బ్రూనో, గెలీలియో గెలిలి వంటి వారికి ఏ గతి పట్టించారో మనం విన్నాం. నిరంకుశ సర్కార్లు, అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు నూతన భావాలను ఎదుర్కొనేందుకు భయపడతాయి. తమ తిరుగులేని అధికారం పట్టును అవి ప్రశ్నిస్తాయేమోనని భయపడతాయి. ఏది సత్యం?..ఏమైనా గెలీలియో లేదా బ్రూనోల భావాలకు ఏం జరిగిందో చరిత్రలో నమోదైంది. సుప్రసిద్ధమైన వైజ్ఞానిక తాత్విక సిద్ధాం తాలకు వారు వైతాళికులుగా గుర్తించబడ్డారు. అయితే 'ఫారిన్ హీట్451'లో కథనం మనను దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. 451 ఫారిన్ హీట్ డిగ్రీలకు వేడి పెరిగితే కాగితం దానికదే మండిపోతుంది. దాంట్లో వున్న విజ్ఞానం మటుమాయం అవుతుంది. అయితే తిరుగుబాటు మొదలెట్టిన వారు పుస్తకాలు చట్టవిరుద్ధంగా దాచిపెట్టి వాటిని కంఠోపాఠం చేయడం ద్వారా తమ మెదళ్లలో నిక్షిప్తం చేస్తారు. పెద్ద పెద్ద ప్రసిద్ధ నవలలను చదివి భావి తరాలకు అందించేందుకు ఉద్యమం చేపడతారు. ఏమైనా వోల్టైర్ చెప్పిన ఒక మాట ప్రసిద్ధమైపోయింది. 'నేను నీ భావాలతో అంగీకరించలేకపోవచ్చు. కానీ దాన్ని చెప్పడానికి నీకు గల హక్కును మాత్రం ప్రాణాలొడ్డి కాపాడతాను." ఇప్పటివరకూ నడుస్తున్న చరిత్రలో మానవ హక్కుల పత్రంలో గానీ, భారత రాజ్యాంగంలో గాని కనిపించే స్ఫూర్తి ఇదే.అయితే ఆరెస్సెస్, హిందూత్వ శక్తులు ఈ భావనను అంగీకరించవు. అంతిమ సత్యానికి తామే నిర్ణేతలమన్నట్టు వారు వ్యవహరిస్తారు. కనుకనే మొత్తం చరిత్ర పుస్తకాలను తిరగరాయడం, మన ప్రామాణిక చరిత్రలో కొన్ని కాలాలనే పాఠ్య పుస్తకాల నుంచి మొత్తంగా తొలగించడం చూస్తాం. మతపరమైన గుర్తింపు దర్పణంలో కనిపించని ఇంకా చెప్పాలంటే మెజారిటీ మత విశ్వాసాలను బలపర్చనిదేదీ నడవకూడదు. అందువల్ల భారతీయుల గతంతో పెనవేసుకున్న వైవిధ్యభరితమై విస్తరించి పాతుకు పోయిన విజ్ఞాన భాండాగారాన్ని నిర్దాక్షిణ్యంగా తిరగరాసేయాలి. విధాన నిర్ణయ క్రమంలో పాత్ర వహించే ముఖ్యమైన అధికార పీఠాలన్నీ ఆరెస్సెస్ మనుషులకోలేక హిందూత్వ భావజాలాన్ని మోసేవారికో అప్పగించాలి. పుస్తకాలపై దాడి..ఇటీవలనే ఆగస్టు 27న అహ్మదాబాద్ పుస్తక పఠనోత్సవంలో అత్యంత అర్థవంతమైన సంఘటన ఒకటి జరిగింది. బజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మతతత్వ నినాదాలతో ఆ కార్యక్రమాన్ని భగ్నం చేశారు. పాల్గొంటున్నవారిని బెదిరించే వ్యాఖ్యానాలు చేశారు. 'అయామ్ మలాలా' (నేను మలాలా), 'ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గరల్' పుస్తకాలను చదువుతున్నారనేది వారి కోపానికి కారణమైంది. ఒకవైపు నుంచి చూస్తే ఇది కాస్త విచిత్రంగా అనిపించవచ్చు. ఎందుకంటే 'నేను మలాలా' అనే పుస్తకం రాసిన మలాలా యూసఫ్ జాయ్ పాకిస్తాన్‌లోని స్వాత్ రాష్ట్రానికి చెందిన అమ్మాయి. బాలికలకు చదవును ప్రోత్సహిస్తున్నందుకుగాను ఆమెపై పాకిస్తాన్ తాలిబన్లు కాల్పులు జరిపారు. ఈ చర్య ద్వారా తాము కూడా అచ్చంగా పాకిస్తాన్ తాలిబన్ల సరసన చేరిపోతున్నామన్నది బజరంగదళ్, విహెచ్‌పి మూకలు అర్థం చేసుకుంటారని ఆశించడం అమాయకత్వమే అవుతుంది. మలాలా ఆ కాల్పుల గాయాల నుంచి బయటపడి దృఢవిశ్వాసానికి ప్రతీకగా మారింది. ఇంతవరకూ నోబెల్ పురస్కారం పొందిన అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. 'ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గరల్' అనే మరో పుస్తకం మీది దాడి కూడా అప్రధానమైనదేమీ కాదు. ఆమ్‌స్టర్‌డాంలో ఫాసిస్టు గెస్టపో గూఢచారి సంస్థకు దొరక్కుండా అటకపై దాక్కుని ప్రాణాలతో బయటపడిన అన్నే ఫ్రాంక్ అనే అమ్మాయి ఆత్మకథ అది. 1942-44 మధ్య కాలంలో తన ఆటోగ్రాఫ్ పుస్తకంలోనే ఆమె ఇవన్నీ రాసిపెట్టింది. సహజంగానే ప్రపంచ సాహిత్యంలో అన్నే ఫ్రాంక్ డైరీ అత్యధికంగా అమ్ముడై రికార్డు సృష్టించిన పుస్తకం.మలాలా యూసఫ్ జాయ్, అన్నే ఫ్రాంక్‌ల పుస్తకాలపై దాడి సమకాలీన భారత దేశంలో జరుగుతున్నదేమిటో ప్రతిబింబిస్తుంది. ప్రతిపక్షంలో అత్యంత సీనియర్ నేతలలో ఒకరైన సోనియా గాంధీ కూడా ఈ భావాల నియంత్రణకు బాధితురాలైనట్టు వార్తలొచ్చాయి. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆమె ఆత్మకథ ప్రతిని ప్రచురణకు చేపట్టిన పెంగ్విన్ ఇండియా కొన్ని భాగాలు తొలగించాలని చెప్పింది. సంపాదకుల సూచనల పేరిట ఈ విధమైన తొలగింపు తతంగం అధికార వర్గాల ఆదేశాలతోనే జరిగివుంటుందనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. సహజంగానే ఆ ప్రచురణను ఇప్పుడు సంస్థ నిలిపేసింది. ఈ విధంగా స్వేచ్ఛాయుత భావాలపైన మాట్లాడటంపైన ఇలా ఒక పద్ధతి ప్రకారం, ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం ఇప్పుడు పరిపా టిగా మార్చబడుతున్నది. మరో సందర్భంలో జాదవ్‌పూర్ యూనివర్సిటీలోనూ ఇటీవల అర్థరాత్రి జరిగిన అపఖ్యాతికరమైన దాడి చెప్పుకోదగింది.ఎబివిపి ఐడెంటిటీ కార్డులు పెట్టుకుని మరీ వచ్చిన ఆ గూండాలు సిసి టివి కెమెరాలలో కూడా చిక్కిపోయారు. దాంతో బెంగాలీలో అత్యధిక సర్క్యులేషన్ గల 'ఆనంద బజార్' దినపత్రిక 'కాషాయ గూండాయిజం' అని మొదటి పేజీలోనే వార్తా కథనం ప్రకటించింది. ముఖ్యమంత్రి దానిపై మండిపడి ఆ పత్రికపై బెదిరింపులకు దిగి క్షమాపణలు చెప్పాలన్నారు. అదెలాగూ జరగలేదన్నది స్పష్టమే. కొద్ది రోజుల తర్వాత బిజెపి కార్యకర్తలుగా చెప్పబడుతున్న గూండాలు ఆ పత్రిక కార్యాలయం చేరి తెల్లటి గోడలకు కాషాయం రంగు పూశారు. 'ఆనంద బజార్' చరిత్ర తెలిసినవారెవరికైనా సరే దాని సంపాదక విధానం వామపక్ష దృక్పథానికి సుదూరంగా వుంటుందని బాగా తెలుసు. కానీ ఇవేవీ పట్టని ఆ గూండాలు మాత్రం ఆ టైటిల్ 'దిమాగీ నక్సల్స్' పని అని బల్లగుద్ది మరీ అంటున్నారు. స్వేచ్ఛాయుత ఆలోచనలు, ప్రసంగాలు, భావ వ్యక్తీకరణలపై పెరుగుతున్న ఈ దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదం తెచ్చిపెడుతున్నాయి. ఫాసిస్టు నిర్మాణ వ్యవస్థగల ఆరెస్సెస్ నుంచి ఇంతకన్నా మరేమీ ఆశించలేము. ఆ విషయం దాని సైద్ధాంతిక గురువులే దాచిపెట్టలేదు. ఆరెస్సెస్‌కు కీలక పాత్రతో, నయా ఫాసిస్టు లక్షణాలు గల ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఇంతకన్నా తక్కువగా జరిగేది వుండదు. కానీ క్రమక్రమంగా భయం వెనక్కుపోయి సమిష్టి సాహసం ముందుకు రావడం మనం చూస్తున్నాం. కనుక మనకు మనం సన్నద్ధమై ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్రా లను కాపాడుకోవడానికి అత్యంత విశాల ఐక్యతను పెంపొందించవలసిన సమయమిది.

# జగన్ గూటికి కొండా సురేఖ?..



## తెలంగాణలో వైసీపీ కింగ్ మేకర్ కాబోతున్నారా?

తెలంగాణ కాంగ్రెస్ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి ఈ రకంగా వేటుపడటం కొండా సురేఖకు మింగుడుపడని అంశమే. దీంతో ఆమె తదుపరి రాజకీయం ఎటువైపు ఉంటుందనే ఆసక్తికర చర్చ మొదలైంది. ప్రస్తుతానికి తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని.. ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని కొండా సురేఖ బహిరంగంగా ప్రకటించినప్పటికీ.. ఆమె ఇతర రాజకీయ ప్రత్యామ్నాయాలను పరిశీలించే అవకాశాలను కొట్టిపారేయలేమని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే కొండా సురేఖ వైఎస్సార్‌సీపీలో చేరి తెలంగాణలో ఆ పార్టీకి నాయకత్వం వహిస్తారంటూ సోషల్ మీడియాలో కొన్ని ప్రచారాలు షికార్లు చేస్తున్నాయి. తెలంగాణలో వైఎస్సార్‌సీపీ విస్తరణకు జగన్ ప్లాన్ చేస్తున్నారని.. రాష్ట్రంలో వైసీపీ పార్టీని నడిపించడానికి బలమైన నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నారని ఓ ఊహాగానం నడుస్తోంది. అయితే ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే కొండా సురేఖ మళ్లీ వైసీపీ వైపు వెళ్లే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. 2014కు ముందు జగన్ వెనుక నడిచినందుకు కొండా సురేఖ దంపతులు ఎన్నో రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కొండా సురేఖ చూపిన విధేయతకు తగిన గుర్తింపు లభించకపోగా.. వారి రాజకీయ భవిష్యత్తు కూడా దాదాపు ప్రమాదంలో పడింది. ఆనాటి చేదు అనుభవాల నేపథ్యంలో ఈ దశలో వైసీపీ గూటికి కొండా సురేఖ మళ్లీ వెళ్తారని అనుకోవడం కేవలం ఓ రాజకీయ ఊహాగానం తప్ప మరొకటి కాకపోవచ్చు.

# అర్ధరాత్రి మహిళపై యువకుడి అఘాయిత్యం..

## తరిమికొట్టిన వీధి కుక్కలు..!



బలగం టీవీ, హైదరాబాద్: సమాజంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. మహిళ ఒంటరిగా కనబడితే చాలు మగాళ్లు.. మృగాళ్ల మాదిరి రెచ్చిపోతున్నారు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా.. వావి వరసలు మరచి అత్యాచా రాలకు తెగబడుతున్నారు. తమ కామ వాంఛ కారణంతో ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇటీవల దేశ రాజధాని దిల్లీలో మరోసారి నిర్భయ లాంటి ఘటన జరిగిన విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోక్సో, నిర్భయ, దిశ లాంటి ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా ఇలాంటి ఘటనలు మాత్రం ఆగడం లేదు. తాజాగా తమిళనాడులోని కోయంబత్తూరులో షాకింగ్ ఘటన జరిగింది. కోయంబత్తూరు తుడియలూరు పరిధిలోని జాతీయ రహదారి రైల్వే వంతెన కింద సెప్టెంబర్ 3 వ తేదీ, అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ మహిళ రోడ్డు పక్కన ఒంటరిగా కూర్చుని ఉంది. అర్ధరాత్రి కావడంతో ఆ రూట్ లో ఎవరూ లేరు. వీధి కుక్కలు మాత్రమే ఉన్నాయి. ఆ మహిళ అనారోగ్యంతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఒంటరిగా రోడ్డు పక్కన ఆ మహిళ సేద దీరుతోంది. ఇంతలో ఓ యువకుడు అటుగా వచ్చాడు. రోడ్డు పక్కన ఒంటరిగా ఉన్న ఆ మహిళను చూసి ఆగాడు. అయితే అదే సమయంలో అతనివైపు ఓ వీధి కుక్క అరుస్తూ వచ్చింది. దాంతో అతడు ఓ రాయి తీసుకుని దాన్ని బెదరగొట్టేందుకు ప్రయత్నం చేశాడు. ఇక ఆ యువకుడ్ని చూసిన మహిళ భయంతో లేచి వెనక్కు వెళ్లింది. అలా ఒక్కసారిగా మహిళపైకి దూసుకొచ్చిన ఆ యువకుడు ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె గట్టిగా అరిచేందుకు ప్రయత్నం చేయగా నోరు మూసి అఘాయిత్యం చేయబోయాడు. అయితే అక్కడే ఉన్న వీధి కుక్క ఆ యువకుడ్ని కరిచే ప్రయత్నం చేసింది. అయినా కూడా ఆ మహిళను వదలకుండా అలాగే పట్టుకుని లైంగికంగా వేధించసాగాడు. మహిళ ఆర్తనాదాలు విని రెండు వీధి కుక్కలు అక్కడికి చేరుకుని గట్టిగా మొరుగుతూ అతనిపైకి దూకాయి. కుక్కల దాడిలో గాయపడిన ఆ యువకుడు ఆమెను వదిలేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నారు పోలీసులు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

# సురేఖపై కీలక నిర్ణయం: కేబినెట్ ప్రక్షాళనకు

## హైకమాండ్ ఆమోదం- ఇన్, ఔట్ వీరే..!!

ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ రాజకీయం ఆసక్తికరంగా మారింది. వరుస భేటీలు.. మంత్రాంగాలతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొండా సురేఖ వివాదం వేళ ముఖ్య నేతలు ఢిల్లీలో మోహరించారు. కేసీ వేణుగోపాల్ తో సీఎం రేవంత్ సుదీర్ఘ చర్చలు చేసారు. కొండా సురేఖ పైన ఒక నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో కేబినెట్ ప్రక్షాళనకు నిర్ణయించారని సమాచారం. ప్రస్తుత మంత్రుల్లో మార్పులతో పాటుగా.. కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలో తుది కసరత్తు జరుగుతోంది. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు మకాం వేసారు. కొండా సురేఖ వ్యవహారంలో చర్యలు తీసుకుంటూనే.. ఆచి తూచి వ్యవహరించాలని పార్టీ హైకమాండ్ నిర్ణయించింది. అందులో భాగం గానే కొండా సురేఖతో మంత్రిపదవికి రాజీనామా చేయించేందుకు నిర్ణయించింది. అదే సమయం లో పార్టీలో ఆమె భవిష్యత్తుకు భరోసా ఇచ్చి రాజీనామా చేయించాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్ తెలుస్తోంది. అయితే అధిష్ఠానం రాజీనామాను ప్రతిపాదిస్తే దానికి కొండా సురేఖ అంగీకరిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.



అమెరికా పర్యటన నుంచి తిరిగి వచ్చిన కేసీ వేణుగోపాల్ పార్టీ తెలంగాణ వ్యవహారాలపై దృష్టి పెట్టారు. సంప్రదింపుల ప్రక్రియను ముఖ్యమంత్రితోనే మొదలుపెట్టారు. సీఎం రేవంత్‌తో ఆయన గంటకు పైగా చర్చలు జరిపారు. ఈ భేటీలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పైనా ఒక నిర్ణయానికి వచ్చారు. కేబినెట్ ప్రక్షాళన.. కీలక మార్పులు సురేఖ పై చర్యలు తీసుకోకుంటే పార్టీకి నష్టమని రేవంత్ నివేదించినట్లు సమాచారం. సురేఖతో పాటు మరికొందరి వ్యవహార శైలికి సంబంధించిన నివేదికలు, మంత్రుల శాఖల వారీ పనితీరు రిపోర్టును ముఖ్యమంత్రి అధిష్ఠానానికి అందజేసినట్లు తెలుస్తోంది. దీంతో.. కేబినెట్ ప్రక్షాళనలో భాగంగా సురేఖ తో పాటుగా మరో ఇద్దరిని తప్పించే అవకాశం ఉందని సమాచారం. వారి స్థానంలో ముగ్గురు కొత్తగా కేబినెట్ లో ఛాన్స్ దక్కనుంది. సురేఖ స్థానంలో ఎమ్మెల్సీ విజయ శాంతి పేరు ఖాయమైనట్లు సమాచారం. సీఎం రేవంత్ కేబినెట్ లోకి విప్ ఆది శ్రీనివాస్ కు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. మహిళతో భర్తీ చేయాలంటే కేకే కుమార్తె విజయ లక్ష్మి పేరు వైపు మొగ్గు చూపుతున్నట్లుగా పార్టీలో ప్రచారం సాగుతోంది. అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకొని.. ప్రస్తుత కేబినెట్ లో బీసీ మంత్రికి టీపీసీసీ పగ్గాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అదే విధంగా స్పీకర్ ప్రసాద కుమార్ ను సైతం కేబినెట్ లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ ఎస్సీ వర్గానికి చెందిన మంత్రిని స్పీకర్ గా చేస్తారని ప్రచారం సాగుతోంది.

# రెడ్డిలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- ఇల్లంతకుంటలో నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరించిన గుండారపు కృష్ణారెడ్డి



బలగం టీవీ, ఇల్లంతకుంట:
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన నాలుగు ప్రధాన హామీలను వెంటనే అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న రెడ్డిల ఒకరోజు నిరసన దీక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉమ్మెంతల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గుండారపు కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు . రెడ్డి కార్పొరేషన్‌ను రూ.వెయ్యి కోట్ల నిధులతో ఏర్పాటు చేసి, పూర్తి స్థాయి పాలకవర్గాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రైతు బీమాను వెంటనే పునరుద్ధరించాలని, గత ప్రభుత్వం బుద్వేల్‌లో రెడ్డి సంక్షేమ హాస్టల్ కోసం కేటాయించిన 15 ఎకరాల భూమిని తిరిగి రెడ్డి సంక్షేమ సంఘానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని ప్రభుత్వ విభాగాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెడ్డిలకు ఇచ్చిన హామీల సాధన కోసం ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఒకరోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, మండల రెడ్డి సంఘం ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వివిధ గ్రామాల రెడ్డి సంఘం అధ్యక్షులు, గౌరవ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలన..అభివృద్ధి, సంక్షేమమే మా ఎజెండా

- సిరిసిల్లలో కాంగ్రెస్ భారీ ర్యాలీ...
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, పేదల సంక్షేమం, విద్య, వైద్యం, సామాజిక న్యాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు రుణాలు, ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నా మని అన్నారు . గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ప్రభుత్వ వైద్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన చర్యల ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు, ఐటీ, మెట్రో, రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు .వెయ్యి రోజుల ప్రజా పాలన ఒక మైలురాయి మాత్రమేనని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, మరింత సంక్షేమంతో తెలంగాణను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏటూరు నాగారంలో బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు..

**పోలీసుల తీరుపై లక్ష్మణ్‌బాబు ఆగ్రహం..**




బలగం టీవీ, ఏటూరు నాగారం:
ములుగు జిల్లా ఏటూరు నాగారంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదంటూ బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పోలీసులు కత్తులతో కోసి తొలగించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఏటూరు నాగారంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఫ్లెక్సీలను కత్తులతో కట్ చేసి తొలగించారని ఆరోపించారు. ఈ ఘటనతో స్థానికంగా రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని ఫ్లెక్సీల తొలగింపును అడ్డుకున్నారు. పోలీసుల చర్యను అక్కడికక్కడే ప్రశ్నించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రతిపక్షాలకు ఉన్న హక్కు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ఫ్లెక్సీలను కత్తులతో కోసి తొలగించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని విమర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాలతోనే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని లక్ష్మణ్‌బాబు మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడబోవని స్పష్టం చేశారు. ఏటూరు నాగారంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే, ఫ్లెక్సీల తొలగింపుపై పోలీసుల వైపు నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి
- ఇందిరాపార్క్ ధర్నాకు తరలిరావాలని పిలుపు
- "హలో రెడ్డి.. చలో ఇందిరాపార్క్" పోస్టర్ ఆవిష్కరణ..



బలగం టీవీ, చందుర్తి:
రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రెడ్డి సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. చందుర్తి, రుద్రంగి మండలాల రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో మర్రిగడ్డ రెడ్డి సంఘం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో "హలో రెడ్డి.. చలో ఇందిరాపార్క్" పోస్టర్‌ను జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేకంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి తదితర రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉద్యమానికి అన్ని గ్రామాల రెడ్డి సంఘాల నాయకులు, యువత, సామాజిక వర్గ ప్రజలు మద్దతుగా నిలిచి, ఈ నెల 8న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నరెడ్ల రాఘవ రెడ్డి, సంయుక్త కార్యదర్శి నల్ల తిరుపతి రెడ్డి, చందుర్తి మండల అధ్యక్షులు బద్దం తిరుమల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పూడూరి ప్రశాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు దూది శ్రీనివాస్ రెడ్డి, దారం బాల్ రెడ్డి, చందుర్తి మండల రెడ్డి యువజన అధ్యక్షులు పూడూరి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మర్రిగడ్డకు చెందిన దారం రాజభూపాల్ రెడ్డి, రామన్నపేటకు చెందిన ఏరెడ్డి రాజిరెడ్డి, ఆశీరెడ్డిపల్లికి చెందిన నల్మాస్ రవీందర్ రెడ్డి, మూడపల్లికి చెందిన బద్దం భాస్కర్ రెడ్డి, జోగాపూర్‌కు చెందిన మిట్టపెల్లి బాపురెడ్డి, కిష్టంపేటకు చెందిన జలంధర్ రెడ్డితో పాటు రుద్రంగి మండలానికి చెందిన గంగం మహేష్ రెడ్డి, సంతపురి బాలు రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు, అన్ని గ్రామాల రెడ్డి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కాలని గ్రామంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
భక్తి, ఆనందం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఇందిరమ్మ కాలని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బైరీ వేణుకుమార్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ శ్రీమతి గడ్డం రచన మధుకర్ గారు పాల్గొని, గ్రామంలోని చిన్నారులు, యువత మరియు పెద్దలతో కలిసి ఎంతో ఉత్సాహంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముచ్చటగా పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల ఆనందం, పెద్దల ఆశీర్వాదాలు, గ్రామ ప్రజల సమిష్టి భాగస్వామ్యంతో వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ముఖ్యమైనవి. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో కలిసి పండుగలను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకం.

# నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి




- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ డెలివరీ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గత రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ, డిఫాల్ట్ మిల్లర్లు బకాయిల చెల్లింపు, వచ్చే సీజన్ కు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో గత రెండు సీజన్లకు సంబంధించి సీఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం చేసి, సూచించిన గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సీజన్ కు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సూచించారు. డిఫాల్ట్ మిల్లర్లు బకాయిలు ఖచ్చితంగా చెల్లించాలని, సకాలంలో బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్ ఉన్నారు.

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నా తల్లిపై పోటీ చేయాలి : కొండా సుష్మిత



బలగం టీవీ, హైదరాబాద్:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తన వ్యక్తిగత వ్యాఖ్యలకు తన తల్లి, కొండా సురేఖపై చర్యలు తీసుకోవడం సరికాదని ఆమె అన్నారు. తాను రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన అవినీతి అంశాలపై మాత్రమే మాట్లాడానని, తన వ్యాఖ్యలను పార్టీని విమర్శించినట్లుగా భావించడం సరికాదని కొండా సుష్మిత స్పష్టం చేశారు. "నా వ్యక్తిగత మాటలకు నా తల్లిపై చర్యలు తీసుకోవడం సరికాదు. నేను రేవంత్ రెడ్డి కుటుంబం అవినీతి గురించి మాట్లాడాను తప్ప, పార్టీని విమర్శించలేదు" అని ఆమె పేర్కొన్నారు. తన తల్లిపై తీసుకున్న చర్యలపై ఆవేదన వ్యక్తం చేసిన సుష్మిత, "నా తల్లిని ఇలా చూసి చాలా బాధ కలిగింది. ఈ అంశంలో రేవంత్ రెడ్డిని నేను శపిస్తున్నాను" అని అన్నారు. అంతేకాకుండా, రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన తల్లిపై రాజకీయంగా పోటీ చేయాలని ఆమె సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే నా తల్లికి పోటీగా నిలబడాలి" అని కొండా సుష్మిత అన్నారు. తన తల్లి విషయంలో తీసుకున్న నిర్ణయాలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా అంశాలను వేర్వేరుగా చూడాల్సిన అవసరం ఉందని సుష్మిత పేర్కొన్నారు.

# వెయ్యి రోజుల వైఫల్యాలకు ప్రజలే తీర్పు చెబుతారు..



- నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ చల్మెడ లక్ష్మీనరసింహారావు

బలగం టీవీ, వేములవాడ: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, వైఫల్యాలకు రానున్న రోజుల్లో ప్రజలే తగిన తీర్పు చెబుతారని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వృద్ధులు, వికలాంగులు, మహిళా సదస్సుకు ముఖ్య అతిథిగా లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వంట వార్పు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సదస్సు సందర్భ ంగా పెన్షన్లు కోల్పోయిన మహిళలు, వృద్ధులు చల్మెడను కలిసి సమస్యలను వివరించారు. చార్వాక వృద్ధుల ఫౌండేషన్ సభ్యులు కూడా తమ స్థలానికి సంబంధించిన సమస్యలను చల్మెడ దృష్టికి తీసుకువచ్చారు. దళితుల భూములను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఫౌండేషన్ స్థలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రస్తుతం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. రేవంత్ సర్కార్ వెయ్యి రోజుల పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించడం కంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, తెలంగాణ ప్రజలు మళ్లీ సారు, కారు, సర్కారు అంటూ నినదిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. చందుర్తి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి చల్మెడ లక్ష్మీనరసింహారావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సదస్సులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చార్వాక ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం..

## -కేటీఆర్‌కు లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026 ఆహ్వానం..



బలగం టీవీ, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు ప్రముఖ వేదికగా ఉన్న లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు.

# శాసన సభ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం..



బలగం టీవీ, హైదరాబాద్: సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ శాసన సభా సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 6న ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం 2 గంటలకు ఆయన అధ్యక్షతన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంయుక్త సమావేశం జరగనుంది. రానున్న శాసన సభా సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అంశాలు, పార్టీ శాసన సభాపక్షం తరఫున చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించారు.

# ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కరించాలి


- డిఎంహెచ్వో కు వినతిపత్రం అందజేత



బలగం టీవీ, హైదరాబాద్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట రమణకు సూర్యాపేట కార్యాలయంలో తుంగతుర్తి మండల ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందించి, అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు మేకల జయమ్మ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తాము కష్టాలు చవితిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించి, కోటి రూపాయల ఇన్సూరెన్స్ ను ప్రభుత్వం నుంచి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి రూ. 50 వేలు డిమాండ్..

# ఇంట్లోకి రానివ్వకుండా హిజ్రాలు రచ్చ రచ్చ.. బాధితురాలి ఆవేదన..!



బలగం టీవీ, హైదరాబాద్: సాధారణంగా పెద్ద నగరాల్లో గృహ ప్రవేశానికి హిజ్రాలు వస్తుంటారు. వారికి నగదు ఇస్తే మంచి జరుగుతుందని యజమాని విశ్వాసం. రూ. 500 నుంచి వారికి తోచినంత హిజ్రాలకు ఇచ్చి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. అయితే ఇటీవలి కాలంలో గృహ ప్రవేశాలు, పెళ్లిళ్లు, శుభకార్యాలయాల్లో హిజ్రాలు రెచ్చిపోతున్నారు. అడిగినంత డబ్బులు ఇచ్చేంత వరకూ అక్కడినుంచి కదిలే ప్రసక్తే లేదని మొండికేస్తున్నారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కొత్త ఇంట్లోనే వారికి శాపనార్థాలు పెడుతున్నారు. అంతేకాక బూతులు తిడుతూ నానా హైరానా చేస్తున్నారు. ఎంతో సందడిగా పండుగలా జరుపుకోవాల్సిన శుభకార్యాల వద్దకు హిజ్రాలు గుంపులు గుంపులుగా చేరుకుని వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా హైదరాబాద్ లోని చింతల్ లో ఓ గృహ ప్రవేశం కార్యక్రమంలో హిజ్రాలు గుంపులు గుంపులుగా వచ్చి హల్ చల్ చేశారు. ఈ మేరకు ఓ మహిళ తమ గృహ ప్రవేశ వేడుకలో ఎదురైన చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. " సంతోషంగా గృహ ప్రవేశం చేయాలనుకుంటే ఫేస్ ఏడుపు మొహం పెట్టి గృహ ప్రవేశం చేయడానికి కారణం వీళ్లే. ఎంత డిమాండ్ చేస్తున్నారంటే..? మీరు గిఫ్ట్ గా ఏదో అడగండి.. వచ్చాం కదా.. తలా ఒక వేయి రూపాయలు ఇవ్వండనో ఏదో అడగండి. వాళ్లకు రూ. 50 వేలు ఇవ్వాలంట. ఏయ్ అంటూ మర్యాద లేకుండా ప్రవర్తించారు. ఏయ్.. వీడియో ఆపు అంటూ బెదిరింపులకు దిగారు. అందరూ నాశనం అయిపోతారు అంటూ శాపనార్థాలు పెట్టారు. ఇంత మంచి గృహ ప్రవేశం పెట్టుకుంటే వీళ్ల చెత్త గోల ఏంటో అర్థం కావట్లేదు. వీళ్ల డిమాండ్ ఎందుకో.. పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదు. మిగతావాళ్లు అందరూ ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియట్లేదు. గృహ ప్రవేశానికి 50,000 ఈ హిజ్రా మాఫియా ప్రజలను కాల్చుకుతింటున్నారు. ఇంటి దగ్గరినుంచే ఫాలో అవుతూ వచ్చారు. కానీయండి.. త్వరగా పదండి అని ముందే ఇంట్లోకి వచ్చి మాకు రూ. 50 వేలు ఇస్తేనే లోపలికి రానిస్తాం.. లేదంటే రానివ్వము.. అని డిమాండ్ చేశారు. అంతేకాక వాళ్ల డ్రెస్ మొత్తం పైకి లేపారు. మనం కష్టపడి కొనుక్కున్న ఇంటిలో వీళ్ల గోల ఏంటో అర్థం కావట్లేదు. హైదరాబాద్ మొత్తం ఇలానే ఉందా..? లేక చింతల్ లోనే ఇలా ఉందా..? అర్థం కావట్లేదు.. అంటూ ఆమె ఎమోషనల్ అయ్యారు. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# మద్దూరులో డిగ్రీ కాలేజీ పనులు వేగవంతం చేయాలి










## : సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవీ, నారాయణపేట: నారాయణపేట జిల్లా మద్దూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గారు ముందుగా మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలేజీ డిజైన్లు, లేఅవుట్‌ను పరిశీలించి పలు మార్పులను సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు జరగాలని, కళాశాలచుట్టూప్రహారీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణా పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని చెప్పారు. స్థానికులను పలకరిస్తూ, వారితో కరచాలనం చేశారు.

# ఆరు గ్యారెంటీల పేరుతో మహిళలను మోసం చేసిండ్రు..

- స్కూటీలు, రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, పెన్షన్లు ఎక్కడ..?
- నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు



బలగం టీవీ, గంభీరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై నిరసన కార్యక్రమలో భాగంగా శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో వంట వార్పు కార్యక్రమం నిర్వహించి బీ ఆర్ ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు హాజరై, మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటివరకు ఒక పావు గ్యారెంటీ మాత్రమే అమలైందని, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలకు ప్రయోజనం కంటే ఇబ్బందులే ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఆర్టీసీపై భారీ ఆర్థిక భారం పడిందని ఆరోపించారు. ప్రభుత్వం ఆర్టీసీకి వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థినులు, మహిళలకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ స్కూటీల ఊసే లేదని, అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను నిర్లక్ష్యం చేశారని, కోర్టు జోక్యంతో వాటి అమలుపై ప్రభుత్వం స్పందించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ వంటి ప్రజలకు ఉపయోగపడే పథకాలను రాజకీయ కారణాలతో నిలిపివేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వాలు మారినా మంచి పథకాలను కొనసాగించాలనే బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం మరింత విస్తరించి కొనసాగించిందని అన్నారు. గర్భిణీలకు అందించే కేసీఆర్ కిట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే చర్యలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేవని తెలిపారు. ఇలాంటి పథకాలను కొనసాగించకుండా నిలిపివేయడం వల్ల పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, మహిళలకు పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం అమలు చేయలేదని, రేషన్ కార్డులు, పెన్షన్లు, రైతు సమస్యలు, ఎరువుల కొరత, ఉద్యోగుల సమస్యలు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలతోనే ఉంటుందని, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని తెలిపారు. మహిళలకు స్కూటీలు, రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, పెన్షన్ పెంపు సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# సురేఖ స్థానంలో కేబినెట్ లోకి రాములమ్మ, ఢిల్లీ డెసిషన్





హైదరాబాద్, సెప్టెంబర్ 04: తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. కొండా సురేఖ ను కేబినెట్ నుంచి బర్తరఫ్ తరువాత కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం సురేఖ పైన చర్యల ద్వారా తమ వైఖరి ఏంటో స్పష్టం చేసింది. సురేఖ స్థానంలో మంత్రిగా మహిళకే అవకాశం ఇవ్వాలి అని హైకమాండ్ నిర్దేశించింది. దీంతో.. రాములమ్మ పేరు దాదాపు ఖాయమైంది. అయితే, అక్కడ అసలు రాజకీయం మొదలైంది. దీంతో.. తదుపరి నిర్ణయాల పై ఉత్కంఠ కొనసాగుతోంది. కొండా సురేఖ పై వేటుతో అధికార కాంగ్రెస్ లో రాజకీయం మారుతోంది. కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూనే హైకమాండ్ కొన్ని సూచనలు చేసినట్లు సమాచారం. ఢిల్లీలో సుదీర్ఘ కసరత్తు తరువాత సురేఖ పైన వేటు వేస్తూనే.. ఒకే సారి ముగ్గురు మహిళలకు పదవులు కట్టబెట్టారు. కాగా, ఇక.. తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయి. త్వరలోనే మంత్రివర్గం ప్రక్షాళన ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. సురేఖ స్థానంలో ఎమ్మెల్సీ విజయ శాంతి పేరు ఖాయమైనట్లు సమాచారం. ఆమెకి మంత్రి పదవి ఇచ్చి కాంగ్రెస్ బలోపేతానికి వాడుకోవాలని రాష్ట్ర నాయకత్వాని కి సూచిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఎందుకంటే కొండా సురేఖ ఫైర్ పార్టీని వీడి రేపటి రోజున కాంగ్రెస్ మీద నిప్పులు చెరగడం ఖాయమని.. ఆమెను ఢీ కొట్టేందుకు విజయశాంతికి అవకాశం ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ లో మార్పులు.. చేర్పులు అయితే.. ఇటు సీఎం రేవంత్ మాత్రం తన మార్క్ లెక్కలతో సిద్దం అవుతున్నారు. కేబినెట్ లోకి విప్ ఆది శ్రీనివాస్ కు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. మహిళతో భర్తీ చేయాలంటే కేకే కుమార్తె విజయ లక్ష్మి పేరు వైపు మొగ్గు చూపుతున్నట్లుగా పార్టీలో ప్రచారం సాగుతోంది. అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకొని.. ప్రస్తుత కేబినెట్ లో బీసీ మంత్రికి టీపీసీసీ పగ్గాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అదే విధంగా స్పీకర్ ప్రసాద కుమార్ ను సైతం కేబినెట్ లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ ఎస్సీ వర్గానికి చెందిన మంత్రిని స్పీకర్ గా చేస్తారని ప్రచారం సాగుతోంది. గ్రేటర్ ఎన్నికల వేళ హైదరాబాద్ పరిధిలోని నేతకు అవకాశం ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. దీంతో.. అసెంబ్లీ సమావేశాల తరువాత మరోసారి సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు. పార్టీ ముఖ్య నేతలతో చర్చించి కేబినెట్ కు తుది రూపు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. దీంతో.. మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్న వారిలో మరో సారి ఉత్కంఠ మొదలైంది.

# కాంగ్రెస్‌లో కీలక పరిణామాల వేళ కేసీఆర్ అనూహ్య నిర్ణయం ..!!

హైదరాబాద్, సెప్టెంబర్ 04: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం.. అధికార పార్టీలో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. కాంగ్రెస్‌లో తాజా ఘటనలను తమకు అనుకూలం గా మలచుకొనేందుకు ప్రతిపక్షాలు వ్యూహాలు సిద్దం చేస్తున్నాయి. అటు సీఎం రేవంత్ ప్రతిపక్షాల ను టార్గెట్ చేస్తున్నారు. బీజేపీ నాయకత్వం తెలంగాణ కేంద్రంగా కొత్త వ్యూహాల అమలుకు సిద్దమైంది. ఇదే సమయంలో మాజీ సీఎం కేసీఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నారేళ్లు పూర్తి కావటంతో ఇక రాజకీయంగా పూర్తి స్థాయిలో యాక్టివ్ కావాలని డిసైడ్ అయ్యారు. కాంగ్రెస్ లో చోటు చేసుకుంటున్న పరిణామాలతో కేసీఆర్ అలర్ట్ అయ్యారు. కొంత కాలంగా మాజీ సీఎం కేసీఆర్ అప్పుడప్పుడు మాత్రమే క్రియాశీలకం గా వ్యవహరిస్తున్నారు. రేవంత్ ముఖ్యమంత్రి అయిన తరువాత కేసీఆర్ లక్ష్యంగా రాజకీయం చేస్తున్నారు. అటు బీజేపీ సైతం రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి బలం పెంచుకునే వ్యూహాలతో ముందుకు వెళ్తోంది. కాగా, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మళ్లీ జనాల్లోకి రావాలని నిర్ణయించారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు త్వరలోనే బస్సు యాత్రకు శ్రీకారం చుట్టేందుకు సిద్దమయ్యారు. అందుకోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు. డిసెంబర్ తరువాత బస్సు యాత్ర ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. అదే సమయంలో సీఎంగానే కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెడతారంటూ కీలక వ్యాఖ్యలు చేసారు.

## కేసీఆర్ బస్సు యాత్ర.. ముహూర్తం ఫిక్స్



కాగా, ఇప్పటికే కేటీఆర్ సైతం పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారు. పాదయాత్ర ద్వారా త్వరలోనే ప్రజల్లోకి వెళ్తానని ఆయన ఇప్పటికే ప్రకటించారు. తండ్రీకొడుకులు ద్విముఖ వ్యూహంతో ఒకేసారి జనంలోకి వెళ్లటానికి సిద్ధమవటం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ యాత్రల షెడ్యూల్‌పై త్వరలోనే స్పష్టత రానుందని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కొంత కాలంగా సీఎం రేవంత్ ప్రతీ సందర్భంలో మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా రాజకీయ విమర్శలు చేస్తున్నారు. అటు బీజేపీ సైతం కేసీఆర్ ను టార్గెట్ చేస్తోంది. రెండున్నారేళ్ల రేవంత్ పాలన పైన ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని పార్టీ నేతలతో తాజాగా కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఇక..తాను ప్రతీ జిల్లాలో పర్యటించి పార్టీ కేడర్ తో సమావేశాలు నిర్వహిస్తానని సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కేటీఆర్ పాదయాత్ర.. కేసీఆర్ బస్సు యాత్ర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గులాబీ శ్రేణుల్లో జోష్ పెంచాలని యోచిస్తున్నారు. దీంతో.. కేసీఆర్ తాజా నిర్ణయం రాష్ట్రంలో రాజకీయంగా కీలక మలుపుగా మారే అవకాశం కనిపిస్తోంది.